www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య



విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి : జెవివి

ప్రజాశక్తి-మదనపల్లి

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు తెలకపల్లి హరింద్రనాథ్ శర్మ, ఎస్.చంద్ర అన్నారు. బుధవారం పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును స్థానిక జడ్పి హైస్కూలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనుచున్నారన్నారు. ఈ కార్యక్రమను 34 ఏళ్ల నుండి నిర్వహిస్తున్నామని చెప్పారు. మదనపల్లి డివిజన్‌లో ఆరు వేల మంది విద్యార్థులు అన్ని మండలాల్లో పాల్గొన్నారన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల విశ్వాసం పెంచడంతో పాటు మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండటం, మూఢాచారాలను నమ్మకపోవడం వంటి వాటితోపాటు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు వెళ్లేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్, ఉపాధ్యక్షులు జయచంద్ర, కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, వెంకటరమణ కృషి చేశారన్నారు. సహకరించిన సైన్స్ ఉపాధ్యాయులకు, సైన్స్ ఫోరమ్ నాయకులు భాస్కర్, శాస్త్రిలకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాలిరవీంద్ర, పుణ్యవతి, శ్రీనివాసులురెడ్డి, వరప్రసాద్, విజయలక్ష్మి, అరుణ, భూదేవి, ముబారక్ జాన్ పాల్గొన్నారు.

ఎన్‌డిఎ నెత్తిన 'కొప్పర్తి' కొరివి

- రూ.250 కోట్ల ఎంఎస్‌ఎంఇని తరలిస్తూ జిఒ
- అక్రమ తరలింపుపై సర్వత్రా నిరసనాగ్రహం
- కోటిరెడ్డి సర్కిల్‌లో జిఒ ప్రతులు దహనం
- పార్టీలకు అతీతంగా నిరసనలు



కడపలో జిఒ 56 ప్రతులను దహనం చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

రాష్ట్రంలోని ఎన్‌డిఎ సర్కారు కొప్పర్తి మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ టెక్నాలజీ, టెస్టింగ్ సెంటర్ (ఎంఎస్‌ఎంఇ) తరలింపు కొరివిని కోరి నెత్తిన పెట్టుకుంది. కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి ఎంఎస్‌ఎంఇని రాజధాని కేంద్రమైన మంగళగిరిలోని సిఆర్‌డిఎకు తరలించాలని పేర్కొంటూ మంగళవారం జిఒ నెంబర్ 56 జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా జిల్లాలోని రాజకీయ పార్టీలకతీతంగా ఆందోళనలు, నిరసనలు మిన్నంటుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం కడప నగరంలోని కోటిరెడ్డిసర్కిల్లో జిఒ ప్రతులను దహనం చేయడం మొదలుకుని ప్రెస్‌మీట్లు నిర్వహించడంతో కూడిన నిరసన జ్వాలలు మిన్నంటాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్రం కడప, విశాఖపట్నం జిల్లాలకు ఎంఎస్‌ఎంఇలను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.250 కోట్లతో కూడిన ఎంఎస్‌ఎంఇని మంజూరు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారం చేపట్టడంతో కొప్పర్తి ఎంఎస్‌ఎంఇకి తరలింపు గ్రహణం పట్టుకుంది. రాష్ట్రంలోనే వెనుకబడిన కడప జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ యువతలో స్కిల్ నైపుణ్యాలను కాలరాయడంపై పెద్దఎత్తున విమర్శలవర్షం కురుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనగానే కడప జిల్లా పట్ల వివక్ష చూపుతారనే విమర్శ ఏళ్ల తరబడి నెలకొని ఉంది. తాజాగా ఎంఎస్‌ఎంఇ తరలింపు జిఒ జారీ ఘటనతో ఆరోపణలను నిజమని నిరూపించుకున్నారనే వాదన వినిపిస్తోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వ్యవహరించిన హయాంలో కొప్పర్తిలో ఏర్పాటు చేయడానికి ముందు కొచ్చిన మల్టీప్యూయెల్ కాంపెక్స్, అడిడాస్ బూట్ల కంపెనీ, డిఆర్‌డిఒ, తదితర ఎనిమిది కంపెనీలు మొగ్గు చూపించడం తెలిసిందే. అప్పటి టిడిపి సర్కారు ఆమోదం లభించకపోవడంతో తరలిపోయిన అంశాల్ని పలువురు మేథావులు, నాయకులు నెమరు వేసుకుంటున్న దృశ్యాలు కనిపించడం గమనార్హం. హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రభుత్వాన్ని తరలించిన సందర్భంగా నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఎంతో ఆర్భాటంగా జిల్లాల వారీగా అభివృద్ధి ఆశలు కల్పించిన సంగతి తెలిసిందే. రాయలసీమ జిల్లాలకు కేంద్రం కేటాయించిన ఎయిమ్స్, ఐఐటి వంటి జాతీయ స్థాయి సంస్థలతోపాటు ఎంఎస్‌ఎంఇ వంటి నైపుణ్య కేంద్రాల తరలింపులతో ఆశలకు సమాధి కట్టినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది.

జిఒ 56 రద్దు చేసే వరకు పోరాటం : సిపిఐ

వివిధ రంగాలలో శిక్షణ, నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రం (ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్) చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిఆర్‌డిఎకు తరలిస్తూ తీసుకువచ్చిన జిఒ నంబర్ 56ను తక్షణ ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. కోటిరెడ్డి సర్కిల్లో జిఒ ప్రతుల దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిందన్నారు. సంస్థ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందని, అలాంటి సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాపై కక్ష సాధింపుతో సిఆర్‌డిఎకు తరలిస్తూ జిఒ తీసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్ర పారిశ్రామిక కారిడారుకు కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాన్ని అనుసంధానిస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటన జిల్లా ప్రజానీకానికి చిగురించిన ఆశలు జిఒ 56తో ఆవిరి అయిపోయాయన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ జి.వేణు గోపాల్, జిల్లా సమితి సభ్యులు కె.మునయ్య, పి.మల్లికార్జున, దస్తగిరి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇని తరలించవద్దు : సిపిఎం

జగన్‌పై కోపంతో కడపను శపిస్తున్న బాబు వైఖరి క్షమించరానిదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా కొప్పర్తి ఎంఎస్‌ఎంఇని కేంద్ర ప్రభుత్వం ఇస్తే దానిని రాష్ట్ర ప్రభుత్వం క్యాపిటల్ డెవలప్మెంట్ అథారిటీ అమరావతికి తరలించడం దుర్మార్గమని చెప్పారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు రాయలసీమ కేంద్రమైన కడప జిల్లాలో ఉపాధి అవకాశాల కోసం కొప్పర్తి మేఘ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రయత్నించారని తెలిపారు. ఆ తర్వాత కొప్పర్తి హబ్ ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్బును అభివృద్ధి చేస్తామని 2024-25 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశాల్లో కూడా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావన చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎంఎస్‌ఎంఇని చంద్రబాబు నాయుడు రాయలసీమ వాసైనా సిఎంగా ఈ ప్రాంత నిరుద్యోగ విద్యావంతులైన యువతి, యువకులకు 17 రంగాల్లో ఉచిత స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దానిని అమరావతికి తీసుకెళ్లడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అవసరమైతే అమరావతిలో మరో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వైఎస్ కుటుంబంపై ఉన్న ద్వేషంతో కడప జిల్లాకు, ఈ ప్రాంత ప్రజలకు, రాయలసీమ కరువు పీడిత ప్రాంత నిరుద్యోగులకు అన్యాయం తీవ్రంగా చేయడమేనని విమర్శించారు. తక్షణం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రజాభిప్రాయంలో స్వచ్ఛందంగా పాల్గొని సమ్మిళిత అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి స్వర్ణాంధ్ర, స్వచ్ఛతా హీ సేవా, ఇది మంచి ప్రభుత్వం, సామాజిక పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, ఎంఇఒలు, సిఆర్‌పిలు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాల హెచ్‌ఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు కళాశాలలో ఈనెల 26 నుంచి 28 వరకు స్వర్ణాంధ్ర విజన్ అంశంపై విద్యార్థులకు వ్యాస వక్తృత పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు కళాశాలల ప్రిన్సిపాల్స్ లను ఆదేశించారు. అదే సమయంలో నేడు, రేపు, ఎల్లుండి ప్రతి విద్యార్థి , స్టూడెంట్ లకు స్వర్ణాంధ్ర విజన్ ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించి వారిలో అవగాహన పెంచి ఆన్‌లైన్ ద్వారా వారి అభిప్రాయాలను ఆలోచనలు పంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎంఇఒలు, సిఆర్‌పిలు, కళాశాలల ప్రిన్సిపల్, పాఠశాల హెచ్‌ఎంలు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు గ్రామ మండల డివిజన్ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేయాలన్నారు. స్వచ్ఛతా హీ సేవా అంశంలో పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. సచివాలయంలో పనిచేసే కార్యదర్శులు, అసిస్టెంట్లు అటు ప్రభుత్వానికి ఇటు కలెక్టర్కు కళ్ళు, చెవులుగా పనిచేయాలిన్నారు. ప్రతి సోమ, గురువారం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రతి పాఠశాలను తప్పనిసరిగా సందర్శించి మరుగుదొడ్ల శుభ్రతపై యాప్‌లో వివరాలు, ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. వందశాతం లక్ష్యాలను సాధించాలని, దీనిని ఒక బరువుగా కాకుండా బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. పాఠశాలలకు వెళ్ళినప్పుడు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూడాలని, గుడ్ల సరఫరాను, సైజును పరిశీలించాలని, అక్కడ ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉంటే నివేదించాలన్నారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ల పనితీరును ఎంపిడిఒలు ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎంపిడిఒలు అందరూ తమ పనితీరును మెరుగుపరుచుకోవాలినారు. నిర్వర్తించాల్సిన విధుల పట్ల శ్రద్ధ ఉండాలిన్నారు. ఇష్టపడి పని చేసి మండలంలో జరుగుతున్న పనులు, కార్యక్రమాలలో ఎంత ప్రగతి సాధించాం, ఎంత పెండింగ్ ఉంది, వెనకబడడానికి కారణాలు ఏమిటి, సమస్య ఎక్కడ ఉంది, తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలిన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను మండలాలలో పటిష్టంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ప్రధానమైన విధి చెత్తను క్లియర్ చేయడం. భాగ్యదారి, క్లీన్లీనెస్ అంశాలలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి లక్ష్యం ఎంత, సాధించింది ఎంత, పెండింగ్ ఉన్నది ఎంత, కారణాలపై సమీక్షించి ప్రగతి సాధనకు కృషి చేయాలి. అక్టోబర్ 1లోగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ 1న సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా సచివాలయాలలోని సిబ్బందితో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, బ్యాంకర్లు పెన్షన్లకు అవసరమైన నగదును సెప్టెంబర్ 30వ తేదీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పెన్షన్లు పంపిణీ చేసే సచివాలయ ఉద్యోగులందరూ అక్టోబర్ 1న ఉదయం ఐదున్నరకే లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి వందశాతం పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సిపిఒ వెంకట పెద్దయ్య, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి, ఎలడిఎం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం



ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతుల తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రాయచోటి మండలంలోని కంచాలమ్మగండి, ఇనాత్‌ఖాన్ చెరువుతో పాటు పలుచెరువులను, వ్యవసాయ పంట పొలాలను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడాది ప్రారంభం నుండి జిల్లాలో వర్షాలు కురవలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా వేరుశనగ, వరి, తదితర పంటలు వర్షాలు లేక కొంత మంది రైతులకు బోర్లు ఉన్నా కూడా భూగర్భజలాలు తగ్గి పోవడంతో బోర్లలో కూడా నీటి శాతం తగ్గి పంటలు పూర్తిగా ఎండిపోయాయని పేర్కొన్నారు. ఏడాదిలో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో భూగర్భజలాలు తగ్గకుండా ఉండాలంటే హంద్రీ-నీవా నీటిని జిల్లాలోని అన్ని చెరువులకు నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎండిన వేరుశనగ పంట పరిశీలన : జిల్లా వ్యాప్తంగా ఎండిపోయిన వేరుశనగ రైతులను ఆదుకోవాలని పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సంబేపల్లి మండలంలోని ముద్దినేనివాండ్లపల్లి, రెడ్డివారిపల్లి మోటకట్ల, శెట్టిపల్లి దేవపట్ల గ్రామాలలో పర్యటించి ఎండిపోయిన వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వరదలతో రైతాంగం నష్టపోతే అన్నమయ్య జిల్లాలో 70 శాతం వేరుశనగ రైతులు వర్షాలు లేక చేతికివచ్చే దశలో కాయలు లేకుండా పంట ఎండిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుజల్లులకు గడ్డి మేత కూడా కుళ్ళిపోయే స్థితిలో ఉందన్నారు. సత్వరం ఉన్నత స్థాయి వ్యవసాయ అధికారులు ప్రతి ఒక గ్రామ స్థాయి వ్యవసాయ అధికారిని కదిలించి ఎండిపోయిన, ఎండిపోతున్న వేరుశెనగ పంట వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ పరిస్థితికి పూర్తి స్థాయి కరువు అని వెంటనే కరువు సాయం తీసుకురావడానికి పాలకులు కృషి చేసే వరకు రైతులు తరుపున సిపిఎం ఉద్యమాలు చేస్తుందన్నారు. ఎండిపోయిన ప్రతి వేరుశనగ రైతుకు హెక్టార్‌కు రూ.50 వేలు పంట నష్ట పరిహారం చెల్లిస్తే తప్ప అప్పుల ఊబి నుండి రైతులు బయటపడలేనట్లు రైతులు తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. కరువు సాయం, పంట నష్ట పరిహారం రైతాంగానికి అందేదాకా ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు ఎస్.రామచంద్ర రైతులు రవికుమార్, రమణ, అశోక్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపుతున్న కాంగ్రెస్ నాయకులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాయచోటి

మహాకూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా దాటినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ పిసిసి జనరల్ సెక్రటరీ షేక్ అల్లాబకష్ పేర్కొన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని కోరుతూ పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు థాలి బజావో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అల్లాబకష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన నూరు రోజులు దాటిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో కరపత్రాలు పంచి పెట్టి,ప్రజలకు మాయ మాటలు చెప్పి, అధికారాన్ని చేపట్టాక టిడిపి, జనసేన, బిజెపి అగ్రనాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఎంతో నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు అమలు చేస్తుంటే ఇక్కడి ప్రభుత్వం నిద్రపోతుందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్, మదనపల్లి పట్టణ అధ్యక్షుడు రెడ్డి సాహెబ్, రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ శాంతయ్య, డిసిసి మహిళా అధ్యక్షురాలు గోసాలదేవి, డిసిసి చీఫ్ సెక్రటరీఅమీర్ మాట్లాడారు. నిరసన కార్యక్రమంలో కిసాన్ జిల్లా అధ్యక్షుడు రాయచోటి చెన్న కృష్ణ, సేవాదళ్ అధ్యక్షుడు అమీర్‌బాషా, దర్బార్, మహమ్మద్ అలీ ఖాన్, మహ్మద్ రఫీక్, సద్దాం, నాయబ్ సాబ్, షఫీ, రవి, శివకృష్ణ, వెంకటాద్రి, అబ్దుల్లా పాల్గొన్నారు.

క్షణికావేశంలో చేసే పొరపాట్లు ఉనికికే ప్రమాదం

ప్రజాశక్తి-పీలేరు

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన లేమితో క్షణికావేశంలో చేసే పొరపాటు మన ఉనికికే ప్రమాదమని ప్రధానోపాధ్యాయిని కె.పార్వతమ్మ, కోర్ సంస్థ అవుట్ రీచ్ వర్కర్ కె.రాజమ్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్, కోర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో బుధవారం పీలేరు మండలం, రేగళ్ళు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "మీకు తెలుసా?" అనే పేరుతో హెచ్ఐవి, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ గురించిన ముఖ్య అంశాలపై అవగాహన కల్పించింది. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపవద్దని, వారు ప్రశాంతంగా జీవించడానికి సహకరించాలని తెలియజేశారు. హెచ్ఐవి అంటువ్యాధి కాదని, అది అంటించుకునే వ్యాధి అని, దీనికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలియజేశారు. క్షయ వ్యాధి, చికిత్స ఎంపిక ప్రాముఖ్యత, హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణలో కండోమ్ పోషించే కీలక పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని స్వర్ణలత, ఇతర ఉపాధ్యాయులతో పాటు కోర్ స్వఛ్ఛంద సేవా సంస్థ సిబ్బంది రాజమ్మ, షర్మిల, రెడ్డి రాణి పాలొన్నారు.

రేపు ఆధ్యాత్మికతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రాయచోటి

సనాతనం, దేవాలయం, భారతీయం జిల్లాలోని దేవాలయాల పాలకవర్గ చైర్మన్లు, ఇన్స్పెక్టర్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు దేవాలయ ఉద్యోగులు, దేవాలయ పూజరులకు కలిపి శుక్రవారం ఉదయం 10 గంటలకు ఒక ఆధ్యాత్మిక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నటు జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాధ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సు శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. దేవాలయాల పురోగతి పరిరక్షణ బాధ్యతలు, భారతీయ సంస్కృతి తదితరాల గురించి సదస్సులో వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాజంపేట స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపుటి శంకర్ ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందిన్నారు. ఆసక్తిగల ప్రతి ఒక్కరూ హాజరు కావాలని తెలిపారు.

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించడంతో పాటు నిత్యం హాజరు కావడం, ఎప్పటి పాఠాలు అప్పుడే చదవడంతో పాటు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై దృష్టి సారించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడాలని తెలిపారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం విద్యాసాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగు రెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి గర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చలో ఢిల్లీ బిసి గర్జనను విజయవంతం చేయాలని జాతీయ బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.రమణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల కులగణన చేపట్టాలంటూ డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న పిలుపునిచ్చిన చలో ఢిల్లీ బిసి గర్జనను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పరంగా బిసి కులగణనను బిసిలకు రాజకీయ పరంగా 50 శాతం అన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్ కల్పించాలని, త్వరగా బిసి కులగనన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జాతీయ రాష్ట్ర అధికార ప్రతినిధి సహజీవన్ బాబు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బిసిలను ఒక ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని తెలిపారు. బిసిలకు రాజకీయ పరంగా చట్టసభల్లో ప్రాముఖ్యత కలిగించేలా చూడాలని డిమాండ్ చేశారు. మదనపల్లిలో కూడా తెలుగుదేశం పార్టీ గెలవడానికి బిసిలే ముఖ్య కారణమన్నారు. దేశంలో బిసిలు రాజకీయ పార్టీలకు వెన్నెముకని తెలిపారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధమైన ఘటనకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువ జన అధ్యక్షులు విజయ మోహన్, శ్రీదేవి మహిళ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, సుబ్బరాయుడు, నియోజవర్గ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి-రాయచోటి : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై నియమాలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సిఐ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఇది సందర్భంగా సిఐ మాట్లా డుతూ 18 ఏళ్లపై బడిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలతో పాటు వాహన దారులు రికార్డులను కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని కోరారు. యువత ర్యాష్ డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదాల బారిన పడుతున్నారని తగు జాగ్రత్తలు పాటించి రోడ్డుపై తమ తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని అన్నారు. రోడ్డు పై వేరొక వాహనం క్రాస్ చేసే సమయంలో సిగ్నల్స్‌ను తప్పని సరిగా వినియోగించుకోవాలని చెప్పారు. రద్దీ ప్రదేశాలలో రవాణా శాఖ అధికారులు తగు జాగ్రత్తలతో వాహనాలు నడపలన్నారు. రోడ్డుపై నడిచే పాదచారులను వాహనదారులు గౌరవించాలని చెప్పారు. రోడ్డు పై ఏదైనా అనుకొని ప్రమాదం జరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి మానవత దృక్పథంతో వారిని వైద్యశాలకు వెళ్లేలా సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.

అభాగ్యులకు అండగా ఉండాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : అభాగ్యులను ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ నడుం బిగించి ముందుకు రావాలని ప్రముఖ ధార్మిక గురువు, ప్రభుత్వ ఖాజి సయ్యద్ షర్ఫుద్దీన్, అహ్మద్ బాబు భాయ్ అన్నారు. బుధవారం మక్తబ ఎ ఇమ్దాదుల్ ఖురఆన్‌లో పైగామే అమన్ (శాంతి సందేశం) అనే అంశంపై ధార్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని ఖురఆన్, దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలతో మానవతం మానవుల ఉపకారం ఒకరినొకరు తొడ్పడం విధవలు, అనాథలు అభాగ్యలను ఆదుకోవాలని ఇందు కోసం అందరు నడుంబిగించి అందరు ఐకమత్యంతో ఉండి సమస్యలను పర్షికరించుకోవాలని పేర్కొన్నారు. సేవ చేయడంలో కుల మత ప్రాంత విభేదాలు లేకుండా ఆపదలో ఉండే వారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంకు వచ్చిన పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులను దుశాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ అఫ్ తాబ్, గౌరవ సలహాదారుడు నిజాంఖాన్, జిలాన్, అమానత్ సేవా సొసైటీ కార్యదర్శి జిలాన్ హకీం, ఫర్హాన్ మొహమ్మద్ అలీ, ఆరిఫ్ పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థల సభ్యులను సన్మానిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తవ్వాలని జెసి ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌లో జిల్లాలోని అన్ని మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిఇఒలు, సూపర్వైజర్లు, డిసిసిబి సిఇఒలతో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్, జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ పురోగతిపై జెసికి వివరించారు. అనంతరం జెసి మాట్లాడుతూ వ్యవసాయ సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియపై ఇప్పటివరకు మంచి పురోగతి సాధించినందుకు సహకార సంఘాల అధికారులను, సిబ్బందిని అభినందించారు. రాబోయే ఐదు రోజులు చాలా కీలకమని, ఇప్పటివరకు సాధించిన పురోగతిని కొనసాగించి వంద శాతం కంప్యూటరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిసిసిబి సిఇఒలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

రూ.3.51 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

ప్రజాశక్తి-మదనపల్లి



లడ్డూతో కన్యారాశి బృందం సభ్యులు

స్థానిక శివ జ్యోతి నగర్-సుభాష్ రోడ్డు ఎక్స్టెన్షన్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద వినాయక చవితి పూర్తయిన తర్వాత నిమజ్జనం సందర్భంగా లడ్డూను వేలం పాటలో రూ3,51,116 లకు కన్యారాశి బృందం సభ్యులు కైవసం చేసుకున్నారు. కార్యక్ర మంలో కమిటీ సభ్యులు చందు, నవీన్, కిరణ్, జబ్బార్, చిన్ను, కార్తీక్, చైతు, ట్వింకిల్ హారిక, రాజు, వంశీ, సాయి, హృదయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.


ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులను, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రస్తుతం సీజన్ క్కుకు కావలసిన మందులు అన్ని ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆస్పత్రి వైద్యులు సమ్మెలో ఉన్నందున ప్రజలకు వైద్య నిమిత్తం వచ్చే వరికి ఎటువంటి ఇబ్బంది జరగకుండా వైద్య సేవలు అందించాలని ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. గ్రామాలలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు గుర్తించి చికిత్స అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఓ సుధాకర్, యుడిసి సుజిత్, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, ఫార్మసిస్ట్ కృష్ణయ్య, స్టాఫ్ నర్సులు హసీనా, రాజేశ్వరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-కలకడ

మండల పరిధిలోని బాటవారిపల్లి పంచాయతీలో ఉన్న బిసి బాలుర వసతి గృహంలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యను నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు రవిప్రకాష్ నాయుడు, మండల అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తారకేశ్వర్‌లకు తెలిపారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకపోవడంతో రెండురోజుల్లోనే బోరు వేయించి నీటి సమస్యకు పరిష్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో మంగళవారం రాత్రి బోరు వేయగా నీళ్లు సమృద్ధిగా పడడంతో నీటి తాగునీటి సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు హాస్టల్ వార్డెన్ సుబ్బరామయ్య, విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన తోలుబొమ్మలాట

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం 5వ తరగతి తెలుగు తోలు బొమ్మలాట పాఠ్యాంశ భోదనలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన 'పరుగో పరుగు' పప్పెట్ షో ఎంతగానో ఆకట్టుకుంది. పిల్లలు చాలా చక్కగా ఏనుగు, కుందేలు, సింహం, కంగారు, కొబ్బరి చెట్టు పప్పెట్స్ తయారు చేసి ఒక అట్ట పెట్టెను తెరగా చేసి హాస్య కథకు అనుగుణంగా పప్పెట్స్ ని కదిలిస్తూ నవ్వించిన తీరు అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ మాట్లాడుతూ ప్రాచుర్యంలో లేని కొన్ని కళలను పిల్లల చేత ఇలా చేయిస్తే వారు తెలుసుకుని వారి భావితరాలకి అందిస్తారని, మన సంస్కృతి, సంప్రదాయాలకు పరిరక్షకులుగా ఉంటారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వల్ల పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించవచ్చునని తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి నీట్‌లో చోటు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లెలోని ఆదర్శ పాఠశాల పూర్వ విద్యార్థికి నీట్-2024 లో చోటు దక్కడం హర్షించదగ్గ విషయమని పాఠశాల ప్రిన్సిపల్ కెఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ పి.హఫీజ్ ఖాన్, ఫర్ హత్ భాను దంపతుల కుమారుడు పి.మహమ్మద్ షాహిద్‌ఖాన్ 2023లో ఆదర్శ పాఠశాల నుంచి ఇంటర్మీడియట్ ను పూర్తి చేశారని అన్నారు. 2024 సంవత్సరంలో జరిగిన నీట్ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 25769, రాష్ట్రస్థాయి ర్యాంక్ -546 సాధించి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో ప్రవేశ అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థి మహమ్మద్ షాహిద్ ఖాన్ పాఠశాలలో చురుకుగా ఉంటూ చదువులలో చక్కగా రాణించేవాడని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తను ఉన్నత చదువులలో మరింతగా రాణించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగడం ఆదర్శ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే తల్లీబిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని ఐసిడిఎస్ సిడిఒ నాగవేణి తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో పౌష్టికాహార మాస ఉత్సవాలలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన చేశారు. పౌష్టికాహార విలువలను వివరించారు. చిరుధాన్యాలతో చేసిన వంట కాలు, ఆకు కూరలు, కూరగాయలు, పప్పు దినుసులు, తదితరాలతో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. గర్భిణులు క్రమం తప్పనకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. రక్తహీతనకు గురికాకుండా ఉంటారని అన్నారు. కాన్పు సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా సురక్షితంగా కాన్పు అవుతారన్నాని అన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, కార్యాలయ ఎఒ ఆనంద్ కుమార్, మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మి, సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలో ఈనెల 29న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని అందరూ వినియోగించు కోవాలని నిర్వాహకులు వినోద్‌కుమారరెడ్డి, బత్రాజుగారిపల్లి అంబటి నాగభూషణ్‌రాజు పేర్కొన్నారు. తిరుపతికి చెందిన వినూత్న ప్రసాద్ అడ్వాన్స్డ్ న్యూరో, స్పిన్ సెంటర్ డాక్టర్ వినూత్న ఆధ్వర్యంలో స్థానిక వశిష్ట స్కూల్‌లో వైద్యశిబిరం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. న్యూమరాలజీ, బ్రెయిన్, స్పిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంచి పెడతారని అన్నారు. తల నొప్పి, మెడ నొప్పి, నడుము నొప్పి, పక్షవాతం, మూర్ఛ రోగం, మతిమరుపు, వణుకుడు వ్యాధి మొదలగు న్యూరాలజీ సంబంధిత వ్యాధులు బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత మెరుగైన వైద్య సేవలు అందిస్తారని అన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచిత వైద్యసేవలను పొందాలని కోరారు.

హౌసింగ్ ఇన్‌ఛార్జి డిఇగా ప్రసాద్

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి హౌసింగ్ ఇన్‌ఛార్జి డిఇగా కెఎస్ఎం ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాపురం మండల హౌసింగ్ అధికారిగా పనిచేస్తూ జిల్లా అధికారులు తనను రాయచోటి ఇన్‌ఛార్జి డిఇగా నియమించారని తెలిపారు. రాయచోటి నియోజకవర్గం లో పెండింగ్‌లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపడతామన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైభోమ్ నదియాదేవి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కస్తూరిబా మహిళా పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఆటస్థలం చదును చేసి విద్యార్థులకు ఆట స్థలం వినియోగంలోకి తేవాలని, మంచినీళ్ల సమస్య ప్రహరీ తదితర సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలన్నారు. ప్రతి తరగతి గదిని పరిశీలించి విద్యార్థులను అడిగి వారి సమస్య లను తెలుసుకున్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని దానికి తగ్గ ఫలితాలు ఉండాలని అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం లోపం లేకుండా ఉండేలా మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజూ పౌష్టికాహారంతో ప్రత్యేక మెనూ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. తాను వివిధ కార్యక్రమాలలో పాల్గొనే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లయితే తన పరిశీలనలో తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను తెలియజేయాలని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు కూడా తరచూ తమ పరిధిలోని పాఠశాలలను మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగ తిరుమలరావు, తహశీల్దార్ అరవింద్‌కిషోర్, ఆర్ఐ నవీన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులతో భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ వైభోమ్ నదియాదేవి

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు : జెడి

ప్రజాశక్తి-రామాపురం

పంట సాగు ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఆ భూమి ఏ పంటకు అనుకూలంగా ఉన్నది ముందే తెలుసుకొని పంట సాగడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా నల్లగుట్టపల్లి, సరస్వతిపల్లిలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రెండవ రోజు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ రైతు పొలంలో భూసార పరీక్షలు చేయించడం వల్ల ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేయించడం వల్ల నేల నుంచి సంక్రమించే తెగులను నివారించుకోవచ్చు తెలిపారు. ఉద్యానవని శాఖ అధికారి నాగమణి మాట్లాడుతూ కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. పశువులకు గొర్రెలకు మేకలకు ప్రస్తుత సీజన్ లో వచ్చే వ్యాధుల గురించి మండల పశు వైద్యాధికారి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఇ-పంట నమోదు చేసుకోవాలి

రైల్వే కోడూరు : రైతులు వారు పండించే పంటల వివరాలను ఇ-పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి కె.సుధాకర్ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా విపిఆర్ కండ్రిగ, గంగరాజు పోడు గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రభుత్వం అందించే అన్ని పథకాలు వర్తించడానికి పంటల వివరాలు ఇ-పంటలో సంబంధిత రైతు సేవా కేంద్రం విఎఎ, విహెచ్ఎ ద్వారా నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేసుకొని, ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పర్యావర ణన్ని కాపాడుతూ ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు సూచించారు. పశుసంవర్ధక అధికారి శిరీష సీజనల్ వ్యాధులు,పథకాలు గురుంచి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివిధ కషయాల ఉపయోగం,తయారీ విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు. **వీరబల్లి:** మండలంలోని కళ్ళే వాళ్ళ పల్లి, కావలి గడ్డ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారి స్వాతి ఆధ్వర్యంలోజరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందులో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఆ శాఖలలో ప్రస్తుతం అమలవుతున్న వ్యవసాయానికి సంబంధించి సస్యరక్షణ గురించి వివరించారు.పొలంలో తెగుళ్ల ఆశించి నప్పుడు ఎటువంటి మందులు పిచికారి చేయాలో తెలిపారు. కార్యక్రమంలో ఊటుకూరు శాస్త్రవేత్తమానస, వ్యవసాయ శాఖ అధికారి స్వాతి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ నాగేంద్ర ప్రసాద్, ఎఇఒ సంతోసమ్మ, రైతులు శంకర్ రెడ్డి, వెంకటరమణ, ప్రజలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అనంతసముద్రం, అప్పయ్య రాజుపేట గ్రామాలను వ్యవసాయశాఖ అనుబంధ శాఖల అధికారులు సందర్శించారు. అనంతసముద్రం, అప్పయ్య రాజుపేట గ్రామంలో అధికారులు మాట్లాడుతూ పొలం పిలుస్తుంది ఒక ప్రాముఖ్యత వ్యవసాయాన్ని విస్తరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు క్షేత్ర సమస్యలపై పరిష్కారం చూపించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.శ్రీకర్ ఊటుకూరు వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి ఇగ్బాల్ , వెటర్నరీ అసిస్టెంట్ తనూజ, గ్రామ ఉద్యాన సహాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామసముద్రం

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆర్.నడింపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు నేరుగా అందేవిధంగా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో నేరుగా ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రజలు కష్టాల్లో ఉంటే చూస్తూ ఊరుకునే వ్యక్తిని కాదని, ప్రజల కష్టాలు తన కష్టాలుగా భావించి సమస్యలు పరిస్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే శ్రీ వాళీశ్వర స్వామి కొండకు 2 కోట్ల రూపాయలతో రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే గట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం రోడ్డు 70 లక్షలతో పనులు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను పగడ్బందీగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యా సాగర్ , జనసేన నాయకులు దారం అనిత, రామంజినేయులు, మాజీ మండల అధ్యక్షులు కృష్ణంరాజు పాల్గొన్నారు .**మదనపల్లె అర్బన్**ప్రజారంజకంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి చేసుకుందని 24వ వార్డు ఇన్‌ఛార్జి టిడిపి నాయకురాలు తలారి రాధమ్మ పేర్కొన్నారు. 24వ వార్డు పరిధిలోని గాంధీపురం, కుమారపురం, సొసైటీ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను పగడ్బందీగా అమలు చేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లను రూ.4000, రూ. 6000 వేలు పెంచడం, అన్న క్యాంటీన్లు ప్రారంభించడం,మెగా డిఎస్‌సి నోటిఫికేషన్లను విడుదల చేసినట్లు తెలిపారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నందు నిరుద్యోగుల కోసం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించి పలువురు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్వాతి, మల్లిక, రెడ్డి రేణుక, సచివాలయ ఉద్యోగి వరుణ్ పాల్గొన్నారు. **కలికిరి:** ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను మేడికుర్తి గ్రామపంచాయతీ కూకటి గొల్లపల్లిలో టిడిపి యువ నాయకులు కేతినేని రాఘవేంద్రయాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి వందరోజుల పరిపాలనలోపే ప్రభుత్వ ఉద్యోగాలు, అన్నా క్యాంటీన్లు పునః ప్రారంభించడం, భూ టైటిలింగ్ రద్దు, వృద్ధాప్య పెన్షన్ పెంపు తదితర అంశాలపై ఇచ్చిన మాటకు కట్టబడి చేశారని రాబోకాలంలో సూపర్ సిక్స్ పథకంలో భాగంగా దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తారని అన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ శ్రీనివాసులు, మేకుర్తి గ్రామ టిడిపి అధ్యక్షుడు పూర్ణచంద్ర యాదవ్, గంగరాజు యాదవ్, కే తనేని శ్రీనివాసులు, మేడికుర్తి గ్రామపంచాయతీ వైస్ సర్పంచి ప్రహల్లాద, పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జడ్‌పి హైస్కూల్ బావికాడపల్లె స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు గ్రహీత సూరినేని రాధాకృష్ణయ్యను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు మాట్లాడుతూ రాధాకృష్ణయ్యకు ఈ అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. మండలంలో ఆయన చేసిన విద్యాభివృద్ధి కృషి ఎనలేనిదని, పిల్లల అభివృద్ధికి పిల్లల పట్ల అభిమానం, ప్రేమ, క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పుటలోనూ చాలా కృషి చేస్తున్నారని కొనియాడారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు పి. సాంబశివరావు మాట్లాడుతూ రాధాకృష్ణయ్య అన్ని విధాల ఈ అవార్డు అందుకోవడానికి అర్హులని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు మండల ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, శ్రీధర్, రామిడ్డి, శాంతకుమారి, రమాదేవి, సిఆర్‌పిలు, ఎంఐఎస్ శివ, కాంప్లెక్స్ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి వైద్యాధికారి ఆద్వర్యం బుధవారం వెలుగు కార్యాలయంలో హెచ్‌ఐవి, ఎయిడ్స్ సుఖ వ్యాధుల పట్ల అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పి ఎస్.అలివేలు, వెంకటరమణ, ఎంసి సుబ్బ రాజు, వెలుగు ఎపిఎం శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్‌ఐవి వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్‌ఐవికి గురికాకుండా చూసుకోవచ్చని అన్నారు. చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్‌ఐవి కేవలం అరక్షిత లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా,హెచ్‌ఐవి ఉన్న గర్భిని నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్‌ఐవి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. హెచ్‌ఐవిపై ఎటువంటి సందేహాలు, అనుమానాలు ఉన్నా ఉచిత హెల్ప్ లైన్ నంబర్ 1097కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ప్రజాశక్తి-చిన్నమండెం


మండల పరిధిలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం స్వచ్చత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎంపిడిఒ దివ్య, ఎంఇఒ శివ నాయక్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు, బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉర్దూ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక,నృత్య, డ్రామా,వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపిడిఇఒ మాట్లాడుతూ పరిసర పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని దీనిపైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక గ్రూపు సభ్యులు,పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

14 మంది గంజాయి ముఠా అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారీ స్థాయిలో గంజాయి ముఠా పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని వినియోగించడంతోపాటు సరఫరా చేస్తున్న 14 మందిని బుధవారం ముదివేడు పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి కొండయ్య నాయుడు సమక్షంలో సిఐలు రమేష్, కళా వెంకటరమణ, ఎస్ఐ దిలీప్ కుమార్ నిందితులను అరెస్టుచూపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కురబలకోట మండలం, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద పలువురు వ్యక్తులు గుంపులుగా ఉన్నట్లు ముదివేడు పోలీసులకు సమాచారం వచ్చిందని అన్నారు. ఎస్ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో వెళ్లి అక్కడ ఉన్న గుంపు పై దాడి చేసి పట్టుకున్నారని చెప్పారు. ప్రధాన నిందితుడు గనిసాబ్ పరారు కాగా 14 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న సంచులను పరిశీలించగా అందులో గంజాయి ప్యాకెట్లు లభించాయని తెలిపారు. వారిని విచారించగా కలకడ మండలం, బంగారువాండ్లపల్లె చెందిన పఠాన్ గనిసాబ్ వద్ద నుంచి తాము గంజాయిని తీసుకొచ్చినట్లు చెప్పారని పేర్కొన్నారు. పట్టబడిన వారంతా మదనపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, కురబలకోట ప్రాంతాలకు చెందిన వారేనని తెలిపారు. హరినాథ్, మేనుపడి రమేష్, షేక్ సైద్‌బాషా, ఎర్రబల్లి రవికిరణ్, గెంతోల్ల శ్రీనాథ్, సురేష్, గుంటిమడుగు షాకిరుల్లా, షేక్ ఫహద్, షేక్ అబ్దుల్ రషీద్, షేక్ సయ్యద్‌బాషా, షేక్ కమల్‌బాషా, మేకల ఖాదర్‌బాషా, షేక్ మహబూబ్ సాబ్, పఠాన్ బావాజీ సుహేల్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మదనపల్లి కేంద్రంగా గంజాయి సరఫరా జరుగు తోందని ముఖ్యంగా ఎలక్ట్రీషన్స్, పెయిం టర్స్, భవన నిర్మాణ కార్మికులు గంజా యికి అలవాటు పడి విని యోగిస్తూ సరఫరా చేస్తున్నారన్నారు. వీరికి వైజాగ్, ఒరిస్సా ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా జరుగుతోందని దీనిపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. గంజాయి సేవించేవారుకళాశాలలు, మరికొన్ని ప్రాంతాలను టార్గెట్ గా చేసుకొని యువతను గంజాయికి అలవాటు చేస్తున్నారని, ఇలాంటి వారిపై ఉక్కుపాదం మోపి అణచివేస్తామని అన్నారు. గంజాయి నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్య


చెకుముకి పరీక్షను రాస్తున్న విద్యార్థులు

విద్యార్థుల్లో నైపుణ్యత పెంచేందుకే చెకుముకి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థులలో సైన్సు పట్ల ఆసక్తి, నైపుణ్యతను పెంచడానికి చెకుముకి నైపుణ్యత పరీక్షలను జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అంజాద్‌అలీఖాన్, రమేష్, శైలజ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కె.ఎస్.ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎపిఆదర్శ పాఠశాల, నిమ్మనపల్లి, రెడ్డివారి పల్లి, బాలినాయన పల్లి జిల్లా ఉన్నత పాఠశాలలోని 8,9,10 తరగతులలోని 200 మంది విద్యార్థులకు చెకుముకి నైపుణ్యత పరీక్షను పాఠశాల స్థాయిలో నిర్వహించినట్లు తెలిపారు. ఒక్కొక్క తరగతిలో అధిక మార్కులు సాధించిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో మండల స్థాయిలో నిర్వహించే పోటీలకు పాఠశాల తరపున ముగ్గురు విద్యార్థులను జట్టుగా పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఓబులవారిపల్లి ఎంపిడిఒ సభా భవనంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది , ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ విజయరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల గురించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిశాయని అన్నారు. పనులు లేని ప్రతి కుటుంబానికి వంద రోజుల పనులను కల్పించాలని ఆదేశించారు. పని దినాలను పంచాయతీల వారిగా విభజించి ప్రతి ఫీల్డ్ అసి స్టెంట్‌కు నిర్దేశించినట్లు పేర్కొన్నారు. టార్గెట్ ప్రకారం పనుల డిమాండ్లను ప్రతి గ్రామంలో కూలీలకు విధిగా పనులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ఉద్దేశించిన కొలతల ప్రకారం పనుల్లో క్వాలిటీ, క్వాంటిటీ ఉండే విధంగా కూలీలతో పనులు చేయించాలని చెప్పారు. ప్రతి పనికి విధిగా ఫోటోలు, వీడియోలు తీసి భద్రపరచు కోవాలని అధికారులు అడిగినప్పుడు వాటిని ఆధారంగా చూపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయికి ఎంపికైన కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగిన అండర్-17,అండర్-14 షటిల్ బ్యాడ్మింటన్‌లో బాలుర విభాగంలోఅండర్-17లో లింట్టో డోమినిక్ జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల కరస్పాండెంట్ లింట్టో, పిఇటి అక్బర్‌బాషా విద్యార్థులు అభినందించారు. ఇలా ప్రతిభ చాటే విద్యార్థులను ముందుకు తీసుకురావాలని ఉద్దేశంతో ప్రయివేట్ పాఠశాలల్లో కూడా క్రీడలపై దృష్టి పెడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కూలి రేట్ల పెంపుదల జిఒ విడుదల చేయాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

సివిల్ సప్లై హమాలీలకు కూలిరేట్లు పెంపుదల జిఒ విడుదల చేయాలని ఎఐటియుసి తంబళ్లపల్లి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సలీం బాషా, బి.వేణుగోపాల్ ఒడ్డి డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం బి.కొత్తకోట సివిల్ సప్లై పాయింట్ వద్ద నిరరస తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలిరేట్ల అగ్రిమెంట్ పెంపుదల జనవరి 01, 2024 నుంచి కొత్త కూలీ రేట్లను పెంచి అమలు చేయాల్సిన సివిల్ సప్లయిస్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం 9 నెలల కావస్తున్నా ఎటువంటి జిఒను విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.బాబాజాన్, గంగాధర్, బి.రాజు, వెంకటరమణ, జబీబుల్లా, లక్ష్మన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని సీతారాంపేట వద్ద మంగళవారం రాత్రి లగేజ్ వ్యాన్ బైక్ ను ఢీకొన్న ప్రమాదంలో రెడ్డిపల్లె అరుంధతివాడకు చెందిన వెంకటేశ్వర్లు (32) మృతిచెందగా ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లికి చెందిన శివరాం తీవ్రంగా గాయపడి విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన శివరాం తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లెకు చెందిన సిద్ధం రామకృష్ణ కు చెందిన వ్యవసాయ పొలంలోని వేప చెట్టును అదే గ్రామానికి చెందిన పారేసి నరసింహులు, అతని ఇద్దరు భార్యలతో కలిసి ఈనెల 11న రామకృష్ణ లేని సమయంలో అతనికి చెందిన వేప చెట్టును కోసి వేశారని అన్నారు. ఈ విషయమై అతను వారిని విచారించగా వారు ముగ్గురు కలిసి దాడి చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ పెద్దలతో చర్చించినా న్యాయం జరగకపోవడంతో, బాధితుడు రామకృష్ణపై దాడి చేసిన ముగ్గురు పై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..బుధవారం తవళం పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలోని చింతచెట్టు కింద కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,500లు నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రయాణికుల ఆటో అదుపు తప్పి బోల్తాడిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ కథనం మేరకు.. పట్టణంలని చీకిలగుట్టకు చెందిన రూప, వరలక్ష్మి, రెహనా , సోనీలు కర్ణాటకలోని ఓ బ్యాంకులో లోను తీసుకోవడానికి బుధవారం శివాజినగర్‌కు చెందిన మహేష్ ఆటోను బాడుగకు మాట్లాడుకుని వెళ్లారని తెలిపారు. అక్కడ పని ముగించుకుని తిరుగు ప్రయాణ మయ్యారని అన్నారు. మార్గమధ్యంలోని బార్లపల్లె వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ తో పాటు నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. ఐదుగురిని 108 లో స్థానిక సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నారని చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.